క్లుప్తంగా

సన్మానం



ఉదయగిరి రూరల్: మండలంలోని వెంగళరావునగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛందంగా సోషల్ సబ్జెక్ట్ వలంటీర్‌గా పనిచేస్తున్న షేక్.ఆఫ్రిన్ ఫాతిమాను ఎంఈఓ–1 టి.వెంకటేశ్వర్లు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గత కొన్ని సంవత్సరాలుగా స్వచ్ఛంద వలంటీరుగా పనిచేస్తూ సోషల్ సబ్జెక్టను బోధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం హసీనా, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

స్పీడ్‌గన్‌తో వాహనాలకు చలానాలు



వాహనాల వేగాన్ని పరిశీలిస్తున్న సీఐ

సంగం: సంగం పరిధిలోని జాతీయ రహదారిపై సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ మంగళవారం స్పీడ్‌గన్‌తో పలు వాహనాలపై చలానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ హైవేలో అధిక వేగంతో వెళ్లే వారిపై రూ.2000 చలానా విధిస్తామన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



ఆత్మకూరు: పట్టణంలోని 15వ వార్డు గిరిజన కాలనీకి చెందిన కొమరగిరి రమణమ్మ అనే దివ్యాంగురాలికి వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ అధినేత, వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు జె.ప్రణీత్ బియ్యంతో పాటు ఇతర నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు. సుమారు రూ.10 వేలు విలువ చేసే సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తోడేటి అశోక్, అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల పరిశీలన



ఉదయగిరి రూరల్: మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను ఇన్‌చార్జి హౌసింగ్ డీఈఈ పీరాన్, ఏపీఓ అజాంఖాన్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేఅవుట్‌లో నిర్మాణం చేపట్టిన వారికి ఉపాధిహామీ పథకం ద్వారా 90 రోజుల పనిదినాలు అందుతున్నాయా.. లేదా? అనే అంశంపై పరిశీలించామన్నారు. వాస్తవంగా నిర్మాణాలు చేపట్టిన వారిని గుర్తించి 90 రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. వారి వెంట ఇన్‌చార్జి ఏఈ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, ఇంజినీరింగ్ సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఏపీఎన్జీజీఓ సభ్యత్వ నమోదు



కొండాపురం: కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల్లో ఏపీఎన్జీజీఓ అధ్యక్షుడు వెలుగోటి మధు ఆధ్వర్యంలో నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఉద్యోగులతో సభ్యత్వ నమోదు మంగళవారం నిర్వహించారు. కొండాపురంలో జరిగిన కార్యక్రమంలో మధు మాట్లాడుతూ నవంబర్‌లో సంఘ వింజమూరు తాలూకా కార్యవర్గ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో సభ్యత్వ నమోదు జరుగుతోందని తెలిపారు. కొండాపురంలో ఎంపీడీఓ ఆదినారాయణతో పాటు స్టాఫ్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. కార్యవర్గ సభ్యుడు దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణ శివారులోని ఓ నివాసంలో జరుగుతున్న పేకాట స్థావరంపై సీఐ గంగాధర్, ఎస్సై జిలానీలు మంగళవారం దాడి చేశారు. ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.41,500 నగదు, నాలుగు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. వారిని కోర్టుకు హాజరు పరచనున్నామని తెలిపారు.

• కావలి(అల్లూరు): పేకాట స్థావరంపై దాడి చేసి తొమ్మిది మంది జూదరులను పట్టుకున్న ఘటన కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై బాజీబాబు మంగళవారం వెల్లడించిన వివరాల మేరకు.. కావలి మండలం ముసునూరు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మంది వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,400 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

అల్లుకుపోతున్న నిర్లక్ష్యం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన కంపచెట్లు

ఉదయగిరి కోనకాలువ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు, కంపకర్ర చెట్లు విపరీతంగా అల్లుకుపోతున్నాయి. వీటి వల్ల అక్కడి ప్రాంతం చిట్టడవిని తలపించేలా మారింది. దీని వల్ల విష సర్పాలు, పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పిచ్చిమొక్కలు మరింత పెరిగితే ప్రమాదం తప్పదని, విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు, కంపకర్ర చెట్లను తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

– ఉదయగిరి రూరల్

కమ్మేస్తున్న కంపచెట్లు

పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో ప్రధాన రహదారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేశాయి. అలాగే ఆ ప్రాంతంలో మలుపు కూడా ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. కంపచెట్ల నుంచి విషపురుగులు, అడవి జంతువులు రోడ్డుపైకి వస్తుండడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

– ఉదయగిరి రూరల్



మలుపు వద్ద పెరిగిన కంపచెట్లు

నీరుగారిన సంకల్పం



గొర్రెలదొడ్డిగా ఉన్న రైతు భరోసా కేంద్రం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతలకు అత్యున్నత సేవలు అందించేందుకు గొప్ప సంకల్పంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కొందరు వారి స్వార్థం కోసం నీరుగార్చుతున్నారు. వరికుంటపాడు మండలంలోని వేంపాడు పంచాయతీలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని కొందరు సొంత భవనంలా వాడుకొంటున్నారు. గొర్రెలను తోలి గొర్రెల దొడ్డిగా మార్చేశారు. నన్ను అడిగేది ఎవరు, అంతా నా ఇష్టం, నాకు ఎవర్రా ఎదురు చెప్పేది అనే విధంగా ఉంది అక్కడి సన్నివేశం.

– వరికుంటపాడు

టీచర్ వర్సెస్ ఎంఈఓ

వింజమూరు (ఉదయగిరి): సమాజంలో గౌరవమైన వృత్తిలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు, ఓ మండల విద్యాశాఖాధికారి అందరూ చూస్తుండగానే గొడవ పడిన ఘటన మంగళవారం సాయంత్రం మండల విద్యావనరుల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు మండలంలో వివిధ పాఠశాలల్లో కొత్తగా 15 మంది టీచర్లు విధుల్లో చేరారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం వారు ఎంఈఓలు పి.రమేష్, మధుసూదన్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా యూటీఎఫ్‌కు చెందిన చెంచలబాబు ఎంఈఓ కార్యాలయానికి చేరుకుని ఎంఈఓలు, కొత్త టీచర్లతో ఫొటో దిగి వారితో ముచ్చటించి పరిచయం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న మరో ఉపాధ్యాయ సంఘం ఏపీఏటీఎఫ్ నేత పి.కొండారెడ్డి ఎంఈఓ కార్యాలయానికి చేరుకొని ఒక ఉపాధ్యాయ సంఘం వారిని పిలిచి తమను ఎందుకు పిలువలేదని ఎంఈఓ–2 మధుసూదన్‌రెడ్డితో మాట్లాడారు. ఈ క్రమంలో తాము ఎవరినీ పిలువలేదని, వారే వచ్చారని ఆయన సమాధానమిచ్చారు. అన్ని విషయాల్లో తాము సహకరిస్తున్నామని, ఇలాంటి విషయాల్లో కూడా తమకు సహకరించకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ క్రమంలో ఎంఈఓ–1 రమేష్ కార్యాలయ వరండాలోకి వెళ్లి తాము ఎవరినీ పిలువలేదని చెబుతుండగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఎంఈఓ–2తో మాట్లాడుతుంటే ఎంఈఓ రమేష్ తనపై నోరు పారేసుకుని దురుసుగా ప్రవర్తించారని కొండారెడ్డి వాపోయారు. ఆయన వ్యవహార తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. దీనిపై ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ తాము ఏ సంఘం వారిని పిలువలేదని తెలిపారు.

బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

సంగం: సర్కిల్ పరిధిలో బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ వేమారెడ్డి సూచించారు. ఈ మేరకు స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అనుమతుల్లేకుండా బాణసంచా విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల నిర్వాహకులు ఫైర్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రజలు బాణసంచా కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. అనంతరం మండల ప్రజలకు ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంగం ఎస్సై రాజేష్, చేజర్ల ఎస్సై తిరుమలరావు, ఏఎస్‌పేట ఎస్సై సైదులు పాల్గొన్నారు.

ఆర్థిక వనరుల పెంపుతో అభివృద్ధి



ఉదయగిరి: గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధికారులు



వరికుంటపాడు ఎంపీడీఓ కార్యాలయంలో..



సీతారామపురం ఎంపీడీఓ కార్యాలయంలో..

ఉదయగిరి : మండలంలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆర్థిక వనరులను పెంపొందించుకోవాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసులు అన్నారు. ఆయన స్థానిక స్త్రీశక్తి భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అభివృద్ధి ప్రణాళిక తయారీ శిక్షణలో మంగళవారం పాల్గొని, మాట్లాడారు. పంచాయతీలకు సంబంధించిన అన్నిరకాల పన్నులను సకాలంలో వసూలు చేసి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. పంచాయతీల్లో భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకునేలా సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రోత్సహించాలన్నారు. దుకాణాలకు సంబంధించి కూడా పన్నులు వసూలు చేయాలన్నారు. అయితే ఈ శిక్షణ కార్యక్రమానికి 17 మంది సర్పంచ్‌లు హాజరుకావాల్సి ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే వచ్చారు. ముందుగా జాతిపిత గాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఓ పద్మజ, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

• వరికుంటపాడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను గుర్తించాలని ఎంపీడీఓ రమణారెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీల సొంత ఆదాయ వనరుల సమకూర్పుపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ చెరువుల్లో కర్ర వేలం, చేపల వేలం, సెల్ టవర్ల వద్ద ఫీజుల వసూళ్ల ద్వారా ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. ఏఓ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ చంద్రశేఖర్, సీనియర్ సహాయకుడు వెంకటాద్రి, సర్పంచ్‌లు దిలీప్‌కుమార్, అరవ మహేష్, నాగభూషణం పాల్గొన్నారు.

• సీతారామపురం: గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తి, ఇతర పన్నులతో సొంతంగా పంచాయతీలకు ఆదాయాలను సృష్టించుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఓన్ సోర్స్ రెవెన్యూ శిక్షణా కార్యక్రమంలో మంగళవారం మాట్లాడారు. స్థానిక సంస్థల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించేందుకు స్వీయ ఆదాయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ఎంతో అవసరమన్నారు. శిక్షణలో భాగంగా ఆస్తి పన్ను, మార్కెట్ ఫీజులు, భవన అనుమతులు, నీటి వినియోగ చార్జీలు వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ రామనాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

• సంగం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఓన్ సోర్స్ రెవెన్యూపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ షాలేట్ పాల్గొని, గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు రాబట్టడం అనే అంశంపై శిక్షణ ఇచ్చారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ముఖ్యంగా వైద్యారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు ప్రతి గ్రామంలోనూ పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టడంతో పాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు శాఖలకు చెందిన అధికారులు వారి పరిధిలోని పురోగతిని సమావేశంలో వివరించారు. ఆత్మకూరు జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, ఎంపీడీఓ పఠాన్ రఫీఖాన్, తహసీల్దార్ పద్మజాకుమారి తదితరులతో పాటు పలు శాఖల ఏఈలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బెడుసుపల్లిలో తాగునీటి అవస్థలు

సీతారామపురం: మండలంలోని బెడుసుపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురవడంతో తాగునీటి కోసం చేతిపంపుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురై రోజులు గడుస్తున్నా పంచాయతీ పాలకులు, విద్యుత్ శాఖ అధికారులు స్పందించకపోవడం తగదన్నారు. దీంతో తమ గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

పంచాయతీ విభజనపై సమావేశం

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని బుక్కాపురం పంచాయతీ విభజనపై మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అధికారులు సమావేశం నిర్వహించారు. దీనికి సర్పంచ్ గైర్హాజరు కాగా పది మంది వార్డు సభ్యుల్లో ఏడుగురు హాజరయ్యారు. పంచాయతీకి విడగొట్టేందుకు ఏడుగురు వార్డు సభ్యులు అంగీకరించలేదు. దీంతో పంచాయతీ విభజనపై తీర్మానం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత విధంగానే పంచాయతీని అలాగే ఉంచాలని వార్డు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.రామారావు, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వింజమూరు మహిళకు డాక్టరేట్



స్రవంతి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని యర్రబల్లిపాళేనికి చెందిన గోదాల స్రవంతి మోహన్‌బాబు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై అధ్యాపకుడు డాక్టర్ ఎం.సునీల్ కుమార్ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా బంధువులు, కుటుంబ సభ్యులు ఆమెను మంగళవారం అభినందించారు.

ఎంఈఓను కలిసిన నూతన ఉపాధ్యాయులు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో 15 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. ఈ నేపథ్యంలో వారు స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓలు పి.రమేష్, మధుసూదన్‌లను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల విధులు, బాధ్యతల గురించి వివరించారు.

బైక్‌ల ఢీ

• ముగ్గురికి గాయాలు

దుత్తలూరు: ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన 565వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా గుంటుపల్లికి చెందిన నవీన్, డానియల్, రాజు అనే ముగ్గురు వ్యక్తులు పనుల నిమిత్తం దుత్తలూరు వైపు వస్తున్నారు. వరికుంటపాడు మండలానికి చెందిన అబ్దుల్‌బాషా కావలి నుంచి స్వగ్రామమైన తిమ్మారెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో నర్రవాడ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో అబ్దుల్ బాషా, నవీన్, డానియల్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలి



శిక్షణ పొందిన మహిళలతో ఆర్డీఓ పావని

ఆత్మకూరు: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటే నైపుణ్యాలు అందిపుచ్చుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓ బి.పావని సూచించారు. పట్టణంలోని ఎల్ఆర్ పల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఒక్కరోజు 'స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్'కు ఆమె మంగళవారం పాల్గొని, మాట్లాడారు. చిన్న వ్యాపార సంస్థలు లేదా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వాటిలో స్వయం సమృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోనె సంచులను తయారు చేయడం, వాటి మార్కెటింగ్ గురించి నిర్వాహకులు వివరించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, గోనె సంచులను ఆర్డీఓ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బాలికల దినోత్సవం



విద్యార్థినులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో బాలికల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేశారు. అనంతరం డిప్యూటీ హెచ్ఈఓ వెంకటేశ్వర్లు, సీహెచ్ఓ శివకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఆడపిల్లల సంఖ్య గణనీయంగా తగ్గుతోందన్నారు. లింగ వివక్ష వంటి సమస్యను పరిష్కరించి, ఆడపిల్లల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆడపిల్ల ఇంట్లో ఉంటే మహాలక్ష్మితో సమానమన్నారు. ఆడపిల్ల చదువుకున్నప్పుడే వారి ఇంటితో పాటు, సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బాలికలకు సమాన విద్య అవకాశాలు కల్పించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని, కలిసికట్టుగా ఆడపిల్లల హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ చెన్నయ్య, కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

'సాయిపేట పంచాయతీని విడగొట్టొద్దు'

• స్థానిక రైతుల వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

కొండాపురం: మండలంలోని సాయిపేట మేజర్ పంచాయతీని విడగొట్టొద్దని స్థానిక రైతులు తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ ఆదినారాయణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ఇద్దరు, ముగ్గురు నాయకులు వారి స్వార్థం కోసం పంచాయతీని విడగొట్టేందుకు చూస్తున్నారన్నారు. పంచాయతీలో మక్కెనవారిపాళెం, ఇస్కపాళెం, కుమ్మరిపాళెం, వెల్లటూరివారిపాళెం, కొమ్మిపాళెం గ్రామాల్లో మొత్తం 5520 ఓట్లు ఉన్నాయన్నారు. పంచాయతీ ఏర్పడినప్పటి నుంచి అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు, అభివృద్ధి బాగానే జరిగాయన్నారు. అంతా బాగానే ఉన్న క్రమంలో పంచాయతీని విడగొట్టడం, పేరు మార్పునకు తాము అంగీకరించలేమన్నారు. దీనిపై ఇటీవల తీర్మానం చేశారని, దీనిని మేము ఆమోదించమన్నారు.

వైద్యాధికారుల సమ్మెకు సిబ్బంది సంఘీభావం



నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలుపుతున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్: గత కొన్ని రోజులుగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ వైద్యాధికారులు నిర్వహిస్తున్న సమ్మెకు గండిపాళెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది ఉదయగిరి పట్టణంలోని పాత సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి తమ మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైద్యాధికారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకుని న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శివకుమారి, ఎస్.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.

పోషకాహార ఆవశ్యకతపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మజాకుమారి



అల్లూరు: నార్త్‌మోపూరు అంగన్‌వాడీ కేంద్రంలో..

వింజమూరు(ఉదయగిరి): స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ పద్మజాకుమారి ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు పోషకాహార ఆవశ్యకతపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లో తరచూ తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేసి పోషకాహార ప్రాముఖ్యతను వివరించాలన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే పోషకాహారం సక్రమంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు షకీలా, తేజస్విని, విజయలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

• అల్లూరు: పిల్లల పోషణ ఎంతో ముఖ్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. అల్లూరు మండల పరిధిలోని నార్త్ మోపూర్ మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. పోషకాహార ఆవశ్యకత, పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

సంగం: సంగం మండల కేంద్రానికి చెందిన బి.వెంకటప్రసాద్ తన స్ప్లెండర్ ప్లస్ బైక్ చోరీకి గురైందని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన బైక్‌ను(ఏపీ 26 ఏఎక్స్ 2612) సంగం దువ్వూరు కాలువ సమీపంలోని మర్రిచెట్టు వద్ద ఉదయం 10.30 గంటల సమయంలో ఉంచి పనిపై వెళ్లానని, మధ్యాహ్నం 3.30 గంటల సమయానికి వచ్చి చూసేసరికి కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.